క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

మొవ్వ:జాతీయ లోక్-అదాలత్ ద్వారా రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి స్వర్ణలత వల్లామార్క్ సూచించారు. వివిధ వాణిజ్య బ్యాంకుల అధికారులు, న్యాయవాదులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. బ్యాంకర్లు రాజీపడదగిన ప్రిలిటిగేషన్ కేసులను కక్షిదారులతో కలసి లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మొవ్వ, ఘంటసాల, చల్లపల్లిలలోని పలు వాణిజ్య బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు. లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించుకునే దిశలో పయనించాలని చెప్పారు.

సీతారాం ఏచూరికి నివాళి



పామర్రు: సీపీఎం నేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పుట్లమ్మ సత్రంలో శుక్రవారం నిర్వహించారు. ఏచూరి అకాల మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. తొలుత ఏచూరి చిత్రపటానికి సీపీఎం పామర్రు మండల మాజీ కార్యదర్శి కాటూరి నాగ భూషణం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దునుకు రఘునాథరావు, చాట్ల శ్రీనివాసరావు, చిరికి వెంకటేశ్వరరావు, పెనుమాల వెంకటేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఈడే కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

గుడివాడరూరల్:ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుండి సమస్యలు అడిగి తెలుసుకుని అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచనలు ఇచ్చారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

పెదముత్తేవి(మొవ్వ): పోషకాహారం తీసుకొని రక్తహీనతను తొలగించుకొని ఆరోగ్య వంతమైన జీవనాన్ని కొనసాగించాలని గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి నాగలక్ష్మి ప్రసన్న సూచించారు. పంచాయతీ పరిధిలోని మూడు అంగనవాడీ కేంద్రాలు సంయుక్తంగా ఒకటవ నెంబరు కేంద్రంలో సంకల్ప ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ నాగలక్ష్మి ప్రసన్న హాజరయ్యారు. కూచిపూడి సెక్టార్ సూపర్‌వైజర్ ఏఎస్ కళ్యాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏఎన్ఎం శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కనుమూరు(పామర్రు):వృత్తి పరమైన కోర్సులపై బాలికలు ఎక్కువగా దృష్టి సారించాలని ఐసీడీఎస్ పెదమద్దాలి సెక్టారు సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి తెలిపారు. గ్రామంలోని కనుమూరు-2 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యకర్త కె.ప్రసన్న పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: పోషకాహార లోపంతో పలు వ్యాధులను నివారించొచ్చని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ప్రతినిధి సీహెచ్ నాగలక్ష్మీ అన్నారు. మండలంలోని గురజ జెడ్పీ హైస్కూల్‌లో పోషకాహారం వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన సదస్సు ప్రధానోపాధ్యాయురాలు జె.సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయురాలు వి.శ్యామల, ఏఎన్ఎం పి.సుంటోరియా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కానుకొల్లులో పొలంబడి

మండవల్లి: అల్లినగరంలో శుక్రవారం పొలంబడి నిర్వహించారు. రైతులకు వారి పొలాల్లో కిందటి సంవత్సరం తీసిన మట్టి నమూనాల ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడాలని తెలిపారు. వరి పొలాలను పరిశీలించి కొన్ని పొలాల్లో ఆకు నల్లి ఆశించినట్లు గుర్తించి నివారణ చర్యలు వివరించారు. ఏఓ జి.శ్రీనివాసరావు, శ్రీరామ్‌సాయి తదితరులున్నారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు



గుడివాడ టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఏర్పాటు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లో గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించాల్సి రావడంతో గత ఏడాది అప్పటి ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో నెహ్రూచౌక్ సెంటర్‌లో విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో ఆ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో విగ్రహాన్ని శుక్రవారం ఏర్పాటు చేసే కార్యక్రమం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నిర్వహించారు. స్థానిక నాగవరప్పాడు వంతెన వద్ద నుండి అంబేడ్కర్ విగ్రహాన్ని భారీ ఊరేగింపుగా మేళతాళాలతో తీసుకువెళ్లి నెహ్రూచౌక్‌లో అమర్చారు. ఈ నెల 30వ తేదీ విగ్రహావిష్కరణ ఉంటుందని దళిత సంఘాల నాయకులు తెలిపారు.

ప్రయాణం.. నరకప్రాయం..

- అధ్వాన రహదారితో అవస్థలు
- గోతులమయంగా మారిన రోడ్డు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



పూర్తిగా దెబ్బతిన్న రహదారి



పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా మారిన జమీగొల్వేపల్లి రోడ్డు

జమీగొల్వేపల్లి(పామర్రు): గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారటంతో గ్రామస్తులు అనేక అవస్థలు పడుతున్నారు. పామర్రు--దిగమర్రు జాతీయ రహదారిలోని జమీగొల్వేపల్లి అడ్డరోడ్డు వద్ద నుంచి సుమారు 3 కిలోమీటర్ల దూరం ప్రయాణించి జమీగొల్వేపల్లి గ్రామం చేరుకోవాలి. ఈ మూడు కిలోమీటర్లలో ఉన్న రహదారి శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పెద్ద గోతులతో నిండిపోవడంతో వాహన దారులు, పాదచారులు నరకయాతన అనుభవిస్తున్నారు. రహదారి పొడవునా కంకర రాళ్లు పైకి లేచి సూది మొనల్లా ఉండటం వలన వాహనాలకు తరచూ పంక్చర్లు పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు రోజూ ఈ రహదారి గుండా ప్రయాణించి ఇతర గ్రామాలకు చేరాల్సిన పరిస్థితి ఉంది.

రహదారి పాడైపోవడం కారణంగా ప్రయాణ సమయంలో నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. రహదారి దారుణంగా ఉంటే ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం పట్టించుకోలేదు. మరమ్మతులైనా నిర్వహించాలని స్థానిక ప్రజా ప్రతినిధులను ఎన్ని సార్లు కోరినా పట్టించుకున్న దాఖలాలు లేవు. రాత్రి సమయాల్లో రహదారి వెంబడి వీధి దీపాలు సక్రమంగా లేని కారణంగా ప్రయాణ సమయంలో వాహనాలు గోతుల్లో పడి పలువురు గాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో కనీసం మరమ్మతులైనా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



రహదారి గోతులతో నిండిపోవడం వల్ల ప్రయాణానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. గత రెండేళ్లుగా రహదారి దుస్థితిని పట్టించుకున్న వాళ్లే లేకుండా పోయారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలి.

– వల్లభనేని వేణుగోపాలరావు(బుల్లిబాబు)

భయం భయంగా ప్రయాణం



రహదారిలో ప్రయాణించాలంటే భయం భయంగా ఉంటోంది. రహదారిలోని గోతుల వలన ప్రయాణం నరకంలా మారుతోంది. గ్రామానికి వచ్చే రహదార్లు అన్ని శిథిలావస్థకు చేరడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. రహదారి పరిస్థితిని అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు.

– నత్తా రవి

రహదారి ఏర్పాటు చేయాలి



రహదారి పూర్తి స్థాయిలో పాడైపోవడం కారణంగా ప్రయాణానికి అవస్థలు పడుతున్నాం. గోతుల్లో వాహన చోదకులు పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి ఏర్పాటు చేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో పయనించేలా చర్యలు తీసుకోవాలి.

– వి.నాగేశ్వరరావు

వ్యాపారాభివృద్ధిలో మెలకువలు నేర్చుకోవాలి



గుడివాడ టౌన్: వృత్తి, వ్యాపారాల్లో అభివృద్ధిపై మెలకువలు నేర్చుకోవాలని విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల ప్రొఫెసర్ పి. గురుప్రసాద్ తెలిపారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో డైనమిక్ బిజినెస్ మానిటరింగ్ అనే అంశంపై శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఎంబీఏ విద్యార్థి వ్యాపార విశ్లేషనలు, పవర్ బీఐపై దృష్టి సారించాలని సూచించారు. డీమార్ట్, రిలయన్స్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల అభివృద్ధిలో ఈ లక్షణాలు దాగి ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కరస్పాండెంట్ కెఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు లోక్ అదాలత్

గుడివాడ టౌన్: రాజీమార్గంలో కేసుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ శనివారం నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీస్ సెంటర్ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఏలూరు రోడ్‌లోని కోర్టు ప్రాంగణంలో అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ కేసులు పరిష్కరించుకోవాలని కోరారు.

యూటీఎఫ్ రణభేరి వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పామర్రు:ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు జరిగే యూటీఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నరేంద్ర పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం రణభేరి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు దశాలుగా పర్యటించి ఉపాధ్యాయులను ఉద్యమానికి సిద్ధం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు.

గుడ్లవల్లేరు: ఆర్థిక, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగే 'రణభేరిని' జయప్రదం చేయాలని యూటీఎఫ్ కృష్ణాజిల్లా కార్యదర్శి ఏవీ వరలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వాల్ పోస్టర్ల ఆవిష్కరణ చేశారు.

ముదినేపల్లి రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఉపాధ్యాయులు సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా నాయకుడు బేతాళ రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. సంఘ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు.

కైకలూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది మూడు నెలలు గడిచిన ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో విఫలమైందని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని శుక్రవారం అందించారు.

మొవ్వ:ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వినతిపత్రాన్ని తహసీల్దార్ కె.మస్తాన్‌కు అందజేశారు. కిషోర్‌బాబు, బి.మాణిక్యాలరావు, ఇంతియాజ్, ఎల్.శ్రీనివాసరావు, జె.కవిత, పి.నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కమ్‌ట్యాక్స్ శాఖలో ఏఐ సేవలు



ప్రసంగిస్తున్న ఇన్‌కమ్ టాక్స్ అధికారులు

గుడివాడ టౌన్: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో ఆదాయపు పన్నుల శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధునాతన సేవలు అందుబాటులోకి తెచ్చిందని చీఫ్ ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్లు వి. సందీప్, జి. ప్రభాకర్ తెలిపారు. కార్యాలయంలో గుడివాడ, మచిలీపట్నం ట్యాక్స్ ప్రొఫెషనర్‌లకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా తమ శాఖ తెచ్చిన అనేక మార్పులపై ప్రాక్టీషనర్‌లు అవగాహన పెంచుకోవాలని సూచించారు. డిజిటల్ సాంకేతిక అంశాలు అర్థమయ్యేలా అధికారులు వివరించారు. ప్రధానంగా పాన్-ఆధార్ లింకింగ్, రిటర్న్‌లు, రీ వెరిఫికేషన్, ఫేస్లెస్ అస్సెస్‌మెంట్, అప్పీల్ వ్యవస్థలపై పన్ను చెల్లింపుదారులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టాక్స్ ప్రాక్టీషనర్స్ మండలి హనుమంతరావు, సీహెచ్ రామారావు, బి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



మాధవ్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి

గుడివాడ టౌన్:జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు అండర్-14 విభాగంలో ఆడేందుకు తమ విద్యార్థి ఎంపికై నట్లు మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ జి. పద్మావతి శుక్రవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది మే 15 నుంచి 18 వరకు చిత్తూరులో జరిగిన 10వ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థి గూడవల్లి రాకేష్ వీరమాధవ్ ప్రతిభను ప్రదర్శించారన్నారు. మాధవ్ ప్రతిభను గుర్తించిన సెలక్షన్ కమిటీ అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకు డెహ్రాడూన్‌లో జరిగే 50వ సబ్ జూనియర్ జాతీయ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ టీమ్ తరుపున ఆడేందుకు ఎంపిక చేశారన్నారు. శుక్రవారం మాధవ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు జి. శ్రీనివాస్, ఎం. సత్యాన్వేష్ పాల్గొన్నారు.

నేతన్నలకు ఉచిత విద్యుత్ అమలు ఎప్పుడో?

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి

కాజ(మొవ్వ): చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై ఇచ్చిన హామీ ఎప్పుడు అమలు చేస్తారని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుడిగే మాధవస్వామి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న అధ్యయన యాత్రలో భాగంగా శుక్రవారం మొవ్వ మండలం కాజ గ్రామంలో పర్యటించారు. పదిమంది సభ్యులు గల బృందం చేనేత కార్మికుల సమస్యలను పరిశీలించి వారితో ముఖాముఖి చర్చించింది. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రిబేట్ యార్న్ సబ్సిడీ, పావలా వడ్డీ, మార్కెటింగ్ ఇన్సెంటివ్ బకాయిలు కలిపి రూ.127 కోట్ల 87 లక్షలు చెల్లించాలని, వీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు పీతాంబరరావు, గొట్టుముక్కల బాలాజీ, ప్రసాద్, కట్టా హేమ సుందర్రావు, పామర్రు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు

మండవల్లి: ఉమ్మడి కృష్ణా జిల్లా అంగళూరు డైట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్-2025లో శ్రీగుత్తికొండ గోపాలరావు కస్తూరిభాయ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభను ప్రదర్శించారు. పెద్దింటి లలితా శివాని (9వ తరగతి) 3డీ శిల్పకళలో ద్వితీయ బహుమతి, దువ్వాడ తనుశ్రీ (9వ తరగతి) ఏకపాత్రాభినయంలో ద్వితీయ బహుమతి, నాగరేణుక (9వ తరగతి) వ్యక్తిగత శాస్త్రీయ సంగీతంలో తృతీయ బహుమతి, గొర్ల బాల ఆంజనేయ నాగసాయి(9), కొమ్మిరెడ్డి లోకేష్ (9) విజువల్ ఆర్ట్స్‌లో ద్వితీయ బహుమతి సాధించారు. వీరిని హెచ్ఎం ఏవీఎస్ ప్రసాద్ అభినందించారు. విద్యార్థులకు గైడ్ టీచర్లుగా యు.ధనలక్ష్మి, జి.రాజకుమారి, ఎం.శివకుమార్, కె.సత్యనారాయణ వ్యవహరించారు. సర్పంచ్, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా చింతలపూడి



పామర్రు(తోట్లవల్లూరు):వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా తోట్లవల్లూరు పాలెం గ్రామానికి చెందిన చింతలపూడి గవాస్కరరాజు నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాయలం ఆదేశాలను జారీ చేసింది. ఈ మేరకు నూతనంగా నియమితులైన గవాస్కరరాజు తనను నియమించడం పట్ల పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ అభ్యున్నతికి తన వంతు పాటుపడతానని పేర్కొన్నారు. గవాస్కరరాజు నియామకంపై మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ నిలిపివేత

పమిడిముక్కల: మండలంలోని వీరంకిలాకు, పమిడిముక్కల, పైడికొండలపాలెం, అగినపర్రు, మామిళ్లపల్లి, తెల్లాకులపాలెం, దేశన్నపాలెం, మగ్గానమాలపల్లి, బొడ్డువానిగూడెం, పోతురాజుమాలపల్లి, గంద్రపువానిగూడెం, కపిలేశ్వరపురం, హనుమంతపురం, ముళ్లపూడి, వేల్పూరు గ్రామాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

కైకలూరు: కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు, సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం పల్లెవాడ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం చెప్పారు.

ఘనంగా హిందీ దినోత్సవం



గుడ్లవల్లేరు: మండలంలోని పెంజేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయురాలు రత్నకుమారి మాట్లాడుతూ 1949లో సెప్టెంబర్ 14న రాజ్యాంగ పరిషత్‌లో హిందీ భాషను జాతీయ భాషగా గుర్తించినట్లు చెప్పారు. అప్పటి నుంచి హిందీ దివస్ వేడుకలు నిర్వహించుకున్నట్లు చెప్పారు.

లింగ నిర్ధారణ చట్ట విరుద్ధం



గుడివాడ టౌన్ : లింగ నిర్ధారణ చట్ట విరుద్ధమని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆర్డీఓ జి. బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణకు పాల్పడకుండా సమాజంలో అవగాహన కల్పించాలన్నారు. భవిష్యత్‌లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామన్నారు. గుడివాడ డివిజన్ పరిధిలో మొత్తం 28 స్కానింగ్ సెంటర్‌లు ఉన్నాయని 4 ప్రభుత్వ ఆధీనంలో ఉండగా 24 ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. డీఎస్పీ ధీరజ్ వినీల్, ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ దీప్తి, జయప్రద తదితరులు పాల్గొన్నారు.

టోకెన్ విధానంలో యూరియా సరఫరా



కురుమద్దాలిలో రైతులకు యూరియా అందజేస్తున్న విజిలెన్స్ డీఎస్పీ బంగార్రాజు, ఏడీ స్వర్ణలత



రైతు సేవా కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

కురుమద్దాలి(పామర్రు):టోకెన్ సిస్టమ్ ద్వారా రైతులకు యూరియా సరఫరా చేస్తున్నామని ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సు మెంట్ డీఎస్పీ యు.బంగార్రాజు తెలిపారు. పీఏసీఎస్ పరిధిలోని కురుమద్దాలి ఆర్ఎస్‌కె వద్ద యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన వ్యవసాయశాఖ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఏడీఏ బి.స్వర్ణలత, ఏవో వి.శివనాగరాణి, పెదమద్దాలి పీఏసీఎస్ సెక్రటరీ రవికుమార్ పాల్గొన్నారు.

చినపారుపూడి(పెదపారుపూడి): రైతు సేవా కేంద్రంలో యూరియా తీసుకోవటానికి శుక్రవారం రైతులు బారులు తీరారు. గంటల తరబడి నిలబడితే యూరియా బస్తా ఒక్కటి మాత్రమే ఇచ్చారని రైతులు అంటున్నారు. వానపాముల, యలమర్రు, పెదపారుపూడి, పాములపాడు, వెంట్రప్రగడ గ్రామాల్లో పీఏసీఎస్ సొసైటీలకు 125 టన్నుల యూరియా శుక్రవారం వచ్చిందని మండల వ్యవసాయాధికారి త్రినాథ ఆంజనేయరావు తెలిపారు. ఈ సందర్భంగా ఒక్కొక్క సొసైటీకి 20 టన్నుల చొప్పున యూరియా దిగుమతి అయిందని చెప్పారు.

ద్వారకా తిరుమలకు వాటర్ ట్యాంక్ వితరణ



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ టౌన్: గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్ నుగలాపు జయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అధినేత వెంకటేశ్వరరావు సేవా కార్యక్రమాల్లో భాగంగా ద్వారకా తిరుమల దేవస్థానానికి నాలుగు వేల లీటర్ల వాటర్ ట్యాంక్‌ను వితరణగా అందజేశారు. శ్రీ శ్రీనివాసా ఆటో ఇంజినీరింగ్ వర్క్స్ ప్రాంగణంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి సేవల కోసం భక్తుల దాహార్తిని తీర్చేందుకు వెంకటేశ్వరరావు చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. భవిష్యత్‌లో ట్రస్ట్ ఆధ్వర్యంలో సమాజానికి మేలు చేసే అనేక కార్యక్రమాలు నిర్వహించాలని తాము కోరుకుంటున్నామన్నారు. శ్రీనివాసా ఆటో ఇంజినీరింగ్ వర్క్స్ డైరక్టర్ నుగలాపు సురేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, డాక్టర్ గోర్జి సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ డ్రెయిన్లు, కాలువలకు మరమ్మతులు

కైకలూరు: నియోజకవర్గంలో డ్రెయిన్లు, కాలువల అభివృద్ధికి రూ.2.50 కోట్లతో పనులు చేయించామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో డ్రెయినేజీ, ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులతో నియోజకవర్గ స్థాయిలో సమీక్ష శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కొంత నిధులు వచ్చాయని, రైతుల సాయంతో అత్యవసర పనులు పూర్తి చేశామన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, ఇరిగేషన్, డ్రెయినేజీ ఈఈలు ఆంజనేయ ప్రసాద్, కిరణ్‌బాబు, డీఈలు రామకృష్ణ, శిరిషా, ప్రజాప్రతినిధులు, డీసీలు, వైస్ డీసీలు, డ్రెయినేజీ, ఇరిగేషన్ శాఖల ఏఈలు, నీటి సంఘం నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

■ ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

మండవల్లి: 2025-2026 విద్యా సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయులుగా నిర్దేశించబడిన వారిని స్థానిక మహిళా సమైక్య సంక్షేమ భవనంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. అదే విధంగా మండవల్లి నుంచి ముదినేపల్లి ఎంఈఓగా బదిలీపై వెళ్లిన డి.రామారావును ఘనంగా సన్మానించారు. మండల విద్యాశాఖాధికారి ఎంఈఓ-1 సీహెచ్ సురేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎస్.రత్నసునాథం, ఉపాధ్యాయులు, మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

■ ముట్టడి జయప్రదం చేయండి

గుడివాడ టౌన్: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర లేబర్ కమిషన్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.కొండ పిలుపు నిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో కమిషన్ కార్యాలయ ముట్టడి పోస్టర్‌లను శుక్రవారం ఆవిష్కరించారు. తక్షణమే బోర్డు పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు రాజు, ప్రభుదాసు, డాల్ఫిన్, రవి, నాగేశ్వరరావు, బండి శ్రీను, ఎం.నారాయణ పాల్గొన్నారు.

■ వేస్ట్ పిక్కర్స్ సంక్షేమానికి కృషి

గుడివాడ టౌన్:వేస్ట్ పిక్కర్ల సంక్షేమానికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరంలో వేస్ట్ పిక్కర్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లోని వేస్ట్ పిక్కర్స్ (జీవనం కొరకు రోడ్ పక్కన చెత్త కుప్పల్లో, డంపింగ్ యార్డులలో ప్లాస్టిక్, ఇనుప వస్తువులు, గాజు సీసాలు, ప్లాస్టిక్ సీసాలు మొదలగు వాటిని ఏరుకునే వారు) సంక్షేమానికి స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

■ పంచాయతీలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ముదినేపల్లి రూరల్: పంచాయతీలు ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా శిక్షణ పొంది కార్యకలాపాలు నిర్వహించాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ) శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కార్యకలాపాల పర్యవేక్షణకు సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇవ్వాలన్నారు. ఎంపీడీవో వై రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో అశోక్, శిక్షణ ప్రాధాన్యత గురించి సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు, కార్యదర్శులకు వివరించారు. సమావేశంలో వైస్ఎంపీపీ రాచూరి రాధా, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శీలం రామకృష్ణ, ఏవో రమణబాబు పాల్గొన్నారు.

■ ఫిల్టర్ బెడ్ ప్రారంభం

కైకలూరు: తాగునీటి సరఫరాకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తోందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. శృంగవరప్పాడు గ్రామంలో నూతన ఫిల్టర్ బెడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం సమీప గుమ్మళ్లపాడు గ్రామంలో పనులు నిమిత్తం వాహనంలో వెళ్లిన వారికి ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వీరి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డీ సాధికారిత కమిటీ చైర్మన్ బలే ఏసురాజు, కూటమి నేతలు త్రినాథరాజు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతిధులు పాల్గొన్నారు.